సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024

## న్యూస్‌రీల్

### 9న జాతీయ లోక్ అదాలత్

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్ అదాలత్ వచ్చే నెల 9న నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల ప్రకారం సిద్దిపేట కోర్టు భవనంలో చేపడుతున్నట్లు తెలిపారు. క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంక్ రికవరీ, తదితర కేసులు పరిష్కరించనున్నామన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ప్రజల రక్షణే ప్రధానం



భరోసా సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ప్రజల రక్షణ గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్, భరోసా, సఖి సెంటర్‌ను సీపీ అనురాధ సోమవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి, నమోదవుతున్న కేసుల వివరాలను సీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణ, రేషన్ బియ్యం, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి ప్రజలకు, యువత, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భరోసా సెంటర్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ సత్వరమే భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అపూర్వరెడ్డి, భరోసా సెంటర్ సిబ్బంది, సఖీ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 24 నుంచి టెక్నికల్ కోర్సుల పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సిద్దిపేటలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల హాల్‌టికెట్లు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి పొందాలన్నారు.

### 26 నుంచి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు



జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్

సిద్దిపేటకమాన్: జిల్లాలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల ఒకట తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన. నినాదం, పోస్టర్ అనే మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు, ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కలెక్టరేట్ దుద్దెడ గ్రామం లీడ్ బ్యాంకు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. సంబంధిత జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, మెడిసిన్ తదితర ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులన్నారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఆగస్టు 1, 2023 నుంచి 31 డిసెంబర్ 2023వరకు అడ్మిషన్ పొందిన మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో వచ్చే నెల 20లోగా వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన పత్రాలు (హార్డ్ కాపీలు) ఏప్రిల్ 15 లోగా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందించాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు, సీఐటీయూ నాయకులు



## మా ఉద్యోగాలు మాకివ్వండి

సిద్దిపేటరూరల్: అకారణంగా తొలగించిన మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు ధర్నాకు దిగారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతు తెలిపిన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ఎలాంటి ఆర్డర్ లేకుండానే తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 80 మందిని రిక్రూట్‌మెంట్ చేశారన్నారు. కరోనాకాలంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవలు అందించిన వారిని రెగ్యులరైజ్ చేయకపోగా విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.





గజ్వేల్‌లో శోభాయాత్ర, ఇన్‌సెట్లో సిద్దిపేటలో శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠలో నేతలు

## ఛత్రపతి శివాజీ ఆదర్శనీయుడు

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు జిల్లాలో వైభవంగా జరిగాయి. పలు సంఘాల ఆధ్వర్యంలో పలుచోట్ల శోభాయాత్రలు, బైక్ ర్యాలీలు చేపట్టారు. కాషాయ జెండాలు చేతపట్టి నినాదాలతో హోరెత్తించారు. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పలువురు వక్తలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కేసీఆర్ కృషితోనే ప్రగతిపథం



బీరప్ప ఉత్సవాల్లో పాల్గొని ప్రసంగిస్తున్న హరీశ్‌రావు

- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- గజ్వేల్ పట్టణంలో పర్యటన
- బీరప్ప ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

గజ్వేల్: మాజీ సీఎం కేసీఆర్ కృషి వల్లే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడమే కాకుండా సంగుపల్లిలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అకుంఠిత దీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్...రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి అదే స్థాయిలో శ్రమించారని కొనియాడారు. అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రత్యేకించి కాళేశ్వరం ప్రాజెక్టుల కారణంగా వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయని చెప్పారు. ఈ పరిస్థితి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో గొప్ప పరివర్తన వచ్చిందన్నారు. మండు వేసవిలోనూ జీవాలకు చెరువులు, వాగుల్లో నీరు దొరికే పరిస్థితి ఏర్పడిందన్నారు. గజ్వేల్‌ను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దడానికి కేసీఆర్ నిరంతరం పనిచేశారని కొనియాడారు. గొల్లకురుమలకు అన్ని రకాల వసతులతో హైదరాబాద్‌లో ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించినట్లు గుర్తు చేశారు. త్వరలోనే ఈ భవనం అందుబాటులోకి రానుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గాలి అనిల్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, టీవైఆర్ ఫౌండేషన్ అధినేత టీ. రాజు, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన పెద్దల తీర్పు

- మనస్తాపంతో గిరిజన మహిళ ఆత్మహత్య
- పాపన్నపేట మండలం అబ్రియా తండాలో ఘటన
- బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన



విజయ(ఫైల్)

పాపన్నపేట(మెదక్): పెద్ద మనుషుల తీర్పు ఓ గిరిజన మహిళ పాలిట శాపంగా మారింది. ఈ సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అబ్రియా తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన లునావత్ విజయ (30), దీప్లా దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. మూడేళ్ల క్రితం దీప్లా విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. అయితే 2014లో గ్రామానికి చెందిన ఓ గిరిజన నాయకుడి వద్ద ఈ దంపతులు రూ. లక్ష అప్పు తీసుకున్నారు. ఈ విషయమై ఇటీవల తండాలో పంచాయితీ నిర్వహించారు. ఇందులో రూ.1.50 లక్షల అప్పు కట్టాలని పెద్దలు తీర్పు చెప్పారు. అయితే తాము తీసుకున్న అప్పులో రూ. 80 వేలు చెల్లించామని బాధితురాలు విజయ పంచాయితీలో వాపోయింది. అప్పు ఇచ్చిన వ్యక్తి సొసైటీ చైర్మన్ కావడంతో తన మామ ధర్మా పేరు మీద రూ. 50వేల బైక్ లోన్ సైతం తీసుకున్నాడని తెలిపింది. కానీ ఇవేవి పంచాయితీ పెద్దలు పట్టించుకోకుండా రూ.1.50 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు. దిక్కుతోచని విజయ.. సోమవారం పురుగు మందు తాగింది. గమనించిన వెంటనే కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. కాగా, న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు.

## స్నేహితుడి నిశ్చితార్థానికి వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- ఒకే బైక్‌పై నలుగురి ప్రయాణం..
- కొంపముంచిన నిర్లక్ష్యం
- కన్నీటి సంద్రమైన బాచారం



శ్రీకాంత్



ప్రభాకర్



భీమయ్య

అల్లాదుర్గం/పాపన్నపేట(మెదక్): స్నేహితుడి నిశ్చితార్థానికి వెళ్లిన ముగ్గురు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. ఈ సంఘటన అల్లాదుర్గం మండలం పెద్దాపూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. సాయంత్రానికి తిరిగి వస్తారనుకున్న కొడుకులు శవాలుగా మారారన్న వార్త విన్న ఆ కుటుంబీకులు తల్లడిల్లిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన చిలుంగారి సుభాష్‌కు అందోల్ మండలం నాదులాపూర్‌కు చెందిన అమ్మాయితో పెళ్లి ఖాయమైంది. ఈక్రమంలో సోమవారం నిశ్చితార్థం నిర్ణయించారు. దీంతో అతడి స్నేహితులైన గడ్డం ప్రభాకర్ (28), గడ్డం భీమయ్య (24), శ్రీకాంత్ (24)తో పాటు తుడుం మాసయ్య నలుగురు ఒకే బైక్‌పై నాదులాపూర్ వెళ్లారు. నిశ్చితార్థం ముగించుకొని తిరిగి వస్తుండగా గడీ పెద్దాపూర్ వద్ద ఓ కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో మాసయ్య తప్ప మిగిలిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. కాగా గాయపడిన మాసయ్యను చికిత్స నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

**మూడు పదులకే మృత్యు ఘోష..**

స్నేహితుని నిశ్చితార్థానికి వెళ్లిన ముగ్గురు స్నేహితుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. మూడు పదుల వయసులోనే నూరేళ్లు నిండాయని కుటుంబ సభ్యులు విలపించారు. ప్రభాకర్‌కు భార్య భాగ్య, కొడుకు, కూతురు ఉన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులు కొడుకు మరణవార్త విని తల్లడిల్లిపోయారు. భీమయ్య, శ్రీకాంత్‌కు పెళ్లిళ్లు కాలేదు. శ్రీకాంత్ ఒక్కడే కొడుకు. అతడికి చెల్లెలు, తల్లిదండ్రులు ఉన్నారు. భీమయ్యకు నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. గ్రామంలో అందరితో కలిసిమెలసి ఉండే స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాచారం ఘొల్లుమంది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దఎత్తున సంఘటన స్థలికి తరలివెళ్లి కన్నీరుమున్నీరయ్యారు.

## నాణ్యతే ముఖ్యం.. తేనె ఉత్పత్తే లక్ష్యం



తేనెటీగల పెంపకంపై శిక్షణ పొందుతున్న మహారాష్ట్రకు చెందిన అధికారులు

**అటవీ కళాశాల, పరిశోధన సంస్థ విశేష కృషి**

- ఎఫ్‌సీఆర్‌ఐ కేరీస్ పేరిట త్వరలో మార్కెట్‌లోకి
- తేనెటీగల పెంపకంపై 2వేల మందికి శిక్షణ



తేనెటీగల పెంపకాన్ని ఆసక్తిగా గమనిస్తున్న అధికారులు

సాక్షి, సిద్దిపేట: అటవీ అభివృద్ధి... సంరక్షణే కాకుండా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలన్న లక్ష్యంతో అటవీ కళాశాల, పరిశోధన సంస్థ ముందుకు సాగుతోంది. ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్‌సీఆర్‌ఐ) ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ బీ కీపింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఐబీడీసీ) నిర్వహిస్తున్నారు. ఐబీడీసీ ద్వారా వివిధ వర్గాల వారికి తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వడంతో తేనెను ఉత్పత్తిని చేస్తున్నారు. అందులో భాగంగా భారత ప్రభుత్వం నుంచి ఎఫ్‌సీఆర్‌ఐ కేరీస్ పేరిట ట్రేడ్ మార్క్‌ను తీసుకున్నారు. మరో వారం రోజుల్లో తేనెతో పాటు వివిధ ఉత్పత్తులను మార్కెట్‌లో విడుదల చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**బీ కీపింగ్ డెవలప్‌మెంట్ సెంటర్**

ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థకు రాష్ట్రంలోనే మొదటి సారిగా ఇంటిగ్రేటెడ్ బీ కీపింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరైంది. నేషనల్ బీ కీపింగ్ అండ్ హనీమిషన్‌లో భాగంగా దీనిని ఫిబ్రవరి 2023లో కేటాయించారు. రైతులు, యువత, వివిధ రాష్ట్రాల్లోని వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, వ్యాపారులకు తేనెటీగల పెంపకంపై ఇలా 2వేల మందికి పైగా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఒక్క రోజు, మిగతా వారికి ఏడు నుంచి పది రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. అలాగే తేనెటీగల బ్రీడింగ్ సైతం చేసి విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్‌పుట్‌గా బీ కీపింగ్‌ను చేర్చింది.

**తేనెతుట్టెలతో క్యాండిల్స్**

తేనెను తీసిన తర్వాత తుట్టెను వృథాగా పడేయకుండా వాటిద్వారా క్యాండిల్స్‌ను తయారు చేస్తున్నారు. క్యాండిల్‌తోపాటు ఇంట్లో ఎయిర్ ఫ్రెషనర్‌గా ఉపయోగపడుతుంది. అలాగే ఇంట్లో ఉన్న జెంప్స్‌ను చంపేందుకు స్వీట్ సువాసన వెదజల్లుతుంది. హనీ సోప్స్‌ను సైతం తయారు చేస్తున్నారు. అన్నింటిని మార్కెట్‌లోకి తెచ్చేందుకు ప్రణాళికను రూపొందించారు. వారంరోజుల్లో మార్కెట్‌లోకి విడుదల చేయనున్నామని కళాశాల వర్గాలు తెలిపాయి.

**500 తేనెటీగల బాక్స్‌లు**



అటవీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తేనెటీగల బాక్స్‌లు

అటవీ కళాశాల ఆవరణలో సుమారు 500 తేనెటీగల బాక్స్‌లు ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ కళాశాల ఆవరణలోని చెట్ల మకరందం, పుప్పొడి పై తేనెటీగలు వాలి వచ్చి పెట్టెలో ఉన్న తుట్టెపై వాలుతాయి. 40 నుంచి 45 రోజులకు ఒకసారి బాక్స్‌ల్లో ఉన్న తేనె తుట్టెలకు ఉన్న తేనె తీస్తారు. ఇలా ఒక్కో బాక్స్ నుంచి సగటున ఏడాదికి 25 నుంచి 30కేజీల తేనె ఉత్పత్తి అవుతుంది. ఇది శాస్త్రీయ పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు. నాణ్యమైన తేనెను మార్కెట్‌లోకి తీసుకవచ్చేందుకు ఇప్పటికే భారత ప్రభుత్వం నుంచి ట్రేడ్ మార్క్‌ను రిజిష్టర్ చేయించారు. ప్రత్యేకమైన సీసాలో ప్యాక్ చేసి ప్రత్యేక లేబుల్‌ను అతికించి మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఐ నిబంధనలతో తేనె నాణ్యతను టెస్టింగ్ కోసం ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కళాశాల ప్రధాన ద్వారం వద్ద అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి విక్రయించనున్నారు.

### రవాణా శాఖ అధికారి బాధ్యతలు స్వీకరణ



వేణుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా రవాణాశాఖ అధికారిగా వేణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లా రవాణాశాఖ అధికారిగా విధులు నిర్వహించి, బదిలీపై సిదిపేటకు వచ్చారు. ఈ సందర్భంగా వేణును పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట ఎంవీఐగా శంకర్‌నారాయణ, ఏఎంవీఐగా సంతోష్‌రెడ్డి సైతం బాధ్యతలు చేపట్టారు.

## అర్జీలను త్వరగా పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణికి 24 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చి ఎంతో నమ్మకంతో అందిస్తున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం పై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రజావాణిలో భూ సంబంధిత, రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూంలు, ఆసరా పింఛన్లు, భూ సమస్యలు మొత్తం కలపి 24 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, ఏఓ రెహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**ట్యాంకును కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోండి**

కొండపాక మండలం మర్పడగలోని 9వ వార్డులో ఎనిమిదేళ్ల క్రితం రూ.2 లక్షలతో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను కొందరు అక్రమంగా కూల్చివేశారని గ్రామానికి చెందిన రాజుగౌడ్ తెలిపారు. ప్రజలకు నిత్యం నీటి అవసరాలు తీరుస్తున్న ట్యాంక్‌ను కూల్చివేయడంతో నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ట్యాంక్‌ను కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## దళితబంధు డబ్బులు ఇవ్వండి

- లబ్ధిదారుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత బంధు లబ్ధిదారులు

సిద్దిపేటరూరల్: దళిత బంధు డబ్బులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంపికైన లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున మంజూరు అయ్యాయన్నారు. ఆ నిధులను ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో నిలిపివేశారన్నారు. ఎలక్షన్ కోడ్ ముగిసి 3 నెలలు కావస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడంలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు దళిత బంధు పథకం కింద రూ.1,000 కోట్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ చిట్టిమళ్ళ సమ్మయ్య, రాష్ట్ర నాయకులు చిన్ని కృష్ణ, మగికొండ రమేశ్, దళిత బంధు సాధన సమితి సభ్యులు బోనగిరి శ్రీనివాస్, దీటి బాలనర్సు, పర్శరాములు, దేవయ్య, తిరుపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేడారం.. సర్వం సిద్ధం

**జాతరకు ఏర్పాట్లు పూర్తి**
- సమ్మక్క, సారలమ్మ గద్దెల ముస్తాబు
- ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

**సిద్దిపేట జిల్లాలో మినీమేడారం జాతరకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి మేడారంలో ప్రారంభమయ్యే సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లలేని భక్తులు ఇక్కడ దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. నంగునూరు, కొహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, మద్దూరు, చిన్నకోడూరు, కొమురవెల్లి తదితర ప్రాంతాల్లో అమ్మవార్ల గద్దెలను ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహణ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.**


అక్కేనపల్లిలో జాతరకు ముస్తాబైన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

**నంగునూరు:** రెండేళ్లకొకసారి వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతరకు నంగునూరు మండలం అక్కేనపల్లిలోని సమ్మక ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. గ్రామంలో మూడు దశాబ్దాలుగా జాతర నిర్వహిస్తున్నారు. మేడారం వెళ్లలేని భక్తుల కోసం సమ్మక్క, సారలమ్మలు గద్దెలను ఎక్కే ఘట్టాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించారు. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు ఉండేందుకు గుడిసెలు వేయడంతో పాటు ఉచితంగా వంట చెరుకు, నీటి వసతి, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. బుధవారం సారలమ్మను, గురువారం సమ్మక్కను గద్దెకు తెచ్చే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తామని ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకోవచ్చని పేర్కొన్నారు. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ఒగ్గుకథ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

**జాతరకు బీజం పడింది ఇలా..**

అక్కేనపల్లి గ్రామ శివారులో ఉన్న పులిగుండ్ల ప్రాంతంలో 30 సంవత్సరాల కిందట గొర్రెల కాపరి మేకలను మేపుతుండగా పెద్ద గుండు వద్ద పసుపు ముద్దలు, కుంకుమ కనిపించాయి. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే కొన్ని రోజుల ముందు ఈ సంఘటన జరగడంతో వన దేవతల మహిమగా గ్రామస్తులు భావించారు. మేడారంలో జాతర నిర్వహిస్తున్న సమయంలోనే వేడుకలు జరిపించాలని పూనకం వచ్చిన మహిళ చెప్పడంతో గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. చందాలు పోగు చేసి పులిగుండ్ల సమీపంలో 14 ఎకరాల స్థలాన్ని సేకరించారు. 1994లో సమ్మక్క, సారలమ్మ గద్దెలు, వారి మేనకోడలు లక్ష్మి, వడిగిద్దరాజు (నాగుపాము) ప్రతిమలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకోసారి మేడారంలో నిర్వహించే విధంగా అదే మూహుర్తాన జాతరను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మొక్కు తీర్చుకునేవారు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి, అమ్మవార్లకు ఒడి బియ్యం పోసి పూజలు నిర్వహిస్తారు. కోళ్లను ఎదుర్కోళ్లుగా వేసి గొర్రెలు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం బంధువులతో కలసి అక్కడే భోజనాలు చేసి తిరుగు ప్రయాణం చేస్తారు.

## గద్దెల ముస్తాబు

**హుస్నాబాద్:** పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో ప్రతి రెండేళ్లకొకసారి సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. జాతర నిర్వహణ కోసం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజుల గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. గద్దెల ఆవరణలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతర జరిగే ప్రాంతాన్ని చదును చేశారు. అక్కడక్కడ చలువ పందిర్లు వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ స్థలంతో పాటుగా కొబ్బరి కాయలు, పూజా సామానుల వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం, లైటింగ్ సిస్టమ్ ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు.


హుస్నాబాద్‌లో సమ్మక్క సారమ్మల గద్దెలు

## ఒడిబియ్యం పోసి..


దేవక్కపల్లెలో సమ్మక్క సారలమ్మ జాతర కోసం చేసిన ఏర్పాట్లు

**బెజ్జంకి (సిద్దిపేట):** మండలంలోని దేవక్కపల్లెలోని మోయతుమ్మెద వాగు శివారులో ప్రశాంత వాతావరణంలో ఐదు రోజుల పాటు ప్రతి ఏటా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. బెజ్జంకి, కోహెడ, గన్నేరువరం మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. భక్తుల సౌకర్యం కోసం రోడ్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు.

## భక్తుల కొంగుబంగారం


కిష్టాపూర్‌లో ముస్తాబైన గద్దెలు

**చిన్నకోడూరు(సిద్దిపేట):** మండల పరిధిలోని కిష్టాపూర్‌లో జరిగే సమ్మక్క- సారలమ్మ జాతర కొలిచే భక్తుల కొంగు బంగారంగా నిలుస్తోంది. 15 సంవత్సరాల నుంచి ఈ జాతర కొనసాగుతోంది. చిన్నకోడూరు, ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## పరివేదలో నాలుగు రోజులు

**కోహెడరూరల్ (హుస్నాబాద్):** మండలంలోని పరివేద, వింజపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల గద్దెలను రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మోయతుమ్మెద వాగు సమీపంలో స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యంతో పాటు స్నాపు గదులను ఏర్పాటు చేస్తున్నారు. జాతర ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఈ జాతరకు కొహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, చిగురుమామిడి మండలాలతో పాటు ఇతర ప్రాంతాలను నుంచి వచ్చి భక్తులు భారీగా తరలివస్తారు. మేడారం కోయ పూజారులచే ఈ జాతర నిర్వహిస్తారు.

## కోయవారే ప్రధాన అర్చకులు

**మద్దూరు(హుస్నాబాద్):** మండలంలోని కూటిగల్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతరను కోయవారే ప్రధాన అర్చకులుగా ముందుండి నడిపిస్తారు. మేడారం వెళ్లలేని భక్తులు తమ మొక్కులను ఇక్కడే అమ్మవార్లకు చెల్లిస్తారు. సిద్దిపేట, జనగామ, మెదక్, హన్మకొండ, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవార్ల దర్శించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఇక్కడ స్నానాల కోసం నల్లా చెరువు వద్ద ఘాట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తులకు మరుగుదొడ్లు కూడా జాతర నిర్వాహకులు ఏర్పాట్లు చేయలేదు.


జాతరకు సిద్ధంగా ఉన్న గద్దెలు

## 2002 నుంచి జాతర

**4 మండలాల నుంచి భక్తుల రాక**

**కొమురవెల్లి(సిద్దిపేట):** సమ్మక్క, సారలమ్మ జాతరకు మేడారం సిద్ధమవుతుండగా మండలంలోని కొమురవెల్లిలో ఉన్న గద్దెలు అమ్మవార్ల జాతరకు సిద్ధమవుతున్నాయి. 2002లో మండల కేంద్రానికి చెందిన చింతల రామ్మూర్తి అమ్మవార్ల జాతరకు పునాది వేశారు. కొమురవెల్లి పాత కమాన్ సమీపంలో అమ్మవార్ల గద్దెలను స్వయంగా తానే ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు రామ్మూర్తి ఆధ్వర్యంలోనే పదిసార్లు జాతర కొసాగింది. అయితే.. కొద్దిరోజుల క్రితం ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఈనెల 21 నుంచి జరిగే జాతర అతని కూతురు రేణుక ఆధ్వర్యంలో జరగనుంది. ఈ జాతరకు కొమురవెల్లి, చేర్యాల, కొండపాక, కుకునూరుపల్లి గ్రామాల నుంచి భారీగా భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. అలాగే.. ఆరేళ్ల క్రితం మండలంలోని పోసానిపల్లిలో కూడా సమ్మక్క-సారలమ్మ జాతర కోసం గద్దెలను ఏర్పాటు చేసి జాతరను కొనసాగిస్తున్నారు.


కొమురవెల్లి కమాన్ వద్ద గద్దెలు

## క్లుప్తంగా

### ఆటో డ్రైవర్ అదృశ్యం


బురాన్

**పటాన్‌చెరు టౌన్:** కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని గండిగూడెంకు చెందిన మహబూబ్ బీ-ఖాజామీయా చిన్న కుమారుడు బురాన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 17న ఆటోతో ఇంటి నుంచి వెళ్లిన బురాన్ తిరిగి రాలేదు. దీంతో బురాన్ కుటుంబ సభ్యులకు ఆటో యజమాని రమేశ్ ఫోన్ చేసి మీ కుమారుడి ఫోన్ కలవడం లేదని, వస్తే చెప్పండి అని సూచించాడు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు బురాన్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి మహబూబ్‌బీ పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ తీగలు చోరీ


వెంచర్‌లో చోరీకి గురైన విద్యుత్ తీగలు

**కొండపాక(గజ్వేల్):** మండలంలోని రవీంద్రనగర్, విశ్వనాథపల్లి పంచాయతీ పరిధిలోని మహాశక్తినగర్ కాలనీలోని వెంచర్‌లో 70 విద్యుత్ స్తంభాల తీగలను ఆదివారం రాత్రి దొంగలు అపహరించారు. వీటి విలువ సుమారు రూ. 30 లక్షల వరకు ఉంటుందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశం నుంచి రవీంద్రనగ్ గ్రామం సుమారు 600 మీటర్ల దూరంలోనే ఉంది. తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉండారని వెంచర్‌లో ప్లాంట్లను కొనుగోలు చేసిన వారు అనుమానం వ్యక్తం చేశారు. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ తీగలు చోరీకి గురి కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిషయమై బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

**మిరుదొడ్డి(దుబ్బాక):** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ పరశురాములు తెలిపారు. మిరుదొడ్డి శివారులోని నాగయ్య వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న కనకయ్యపై కేసు నమోదు చేశామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఆయిల్ పామ్ పంటపై అడవి పందుల దాడి

**ఝరాసంగం(జహీరాబాద్):** సాగులో ఉన్న ఆయిల్ పామ్ పంటపై అడవి పందుల దాడి చేశారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన రైతు చంద్రమ్మ ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నారు. రెండు మూడు రోజుల నుంచి అడవి పందులు గుంపులుగా వచ్చి దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 70 వరకు మొక్కలు నాశనం అయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లగా.. సోమవారం పంటను పరిశీలించి వివరాలు సేకరించారు.

# కాళేశ్వరం.. తెలంగాణకు గుండెకాయ


దుబ్బాకలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**
- బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకు కుట్ర
- హామీలను పక్కదోవ పట్టించేందుకే..

**దుబ్బాకటౌన్:** కరువు కాటకాలకు నిలయమైన తెలంగాణలో శాశ్వతంగా కరువును దూరం చేసి సస్యశ్యామలం చేసేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, తొగుట మండలాల్లోని 154 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు గుండెకాయగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగానే మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్, కూడవెల్లి, హల్దీ వాగులకు నీళ్లొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా పక్కదారి పట్టించేందుకే బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసే పని పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దివ్యాంగులకు న్యాయం చేసింది కేసీఆరే**

దివ్యాంగులకు అన్ని విధాలుగా న్యాయం చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం దుబ్బాకలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 20 మంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేశారు. దివ్యాంగుల కష్టాలను గుర్తుపెట్టుకొనే కేసీఆర్ ప్రభుత్వం రూ.4,016 పింఛన్‌ను అమలు చేసిందన్నారు. దివ్యాంగులకు ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు తాను అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు.

**అంగన్‌వాడీలు అంకిత భావంతో పని చేయాలి**

అంగన్‌వాడీలు అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కొత్త డ్రెస్‌లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత ఎంపీపీ కొత్త పుష్పలత, ,జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో సైబర్ మోసం

- రూ.10 లక్షలు ఒకరు.. 8లక్షలు మరొకరు.
- పోగొట్టుకున్న బాధితులు

**పటాన్‌చెరు టౌన్:** ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.10 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన మొబైల్ షాప్ వ్యాపారికి గతేడాది నవంబర్ 15వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో సదరు వ్యాపారి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు, కమీషన్ చూపిస్తూ అపరిచిత వ్యక్తి వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

**పటేల్‌గూడలో మెకానికల్ ఇంజనీర్**

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన మెకానికల్ ఇంజనీర్‌కి గత ఏడాది అక్టోబర్ 28న ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ టెలిగ్రామ్ ద్వారా వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ మెకానికల్ ఇంజనీర్ నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.8 లక్షల 29 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా.. అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, తర్వాత అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

# పార్ట్ టైం ఉద్యోగం పేరిట దగా

- రూ.2.74 లక్షలు పోగొట్టుకున్న
- ఇద్దరు బాధితులు

**సిద్దిపేటకమాన్:** పార్ట్ టైం జాబ్ పేరిట గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి ఇద్దరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి సైబర్ మోసానికి గురయ్యారు. ఈ సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. సీపీ అనురాధ కథనం ప్రకారం.. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పార్ట్ టైం ఉద్యోగం ఉందని ఓ లింకును పంపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన వివరాలు నమోదు చేయగానే. అతడి నంబర్‌ను ఇన్వెస్టిమెంట్ టెలిగ్రామ్ యాప్‌కు బదిలీ చేశారు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి సూచించాడు. దీంతో బాధితుడు మొదటగా రూ.3వేలకు రూ.6వేలు, రూ.10వేలకు రూ.20వేలు లాభాలు వచ్చాయి. తర్వాత పలు విడతలుగా మొత్తం రూ.2,09,550 పెట్టుబడిగా పెట్టగా తర్వాత లింకు ఓపెన్ చేసి చూడగా బ్లాక్ చేసి ఉండటంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మరొక వ్యక్తి కూడా ఇదే తరహాలో రూ.64,550 పెట్టుబడిగా పెట్టి సైబర్ మోసానికి గురయ్యాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.



# దొంగల వేటలో పోలీసులు

- ముగ్గురు సభ్యుల ముఠా పనే..
- కర్ణాటక వాసులుగా నిర్ధారణ

**జహీరాబాద్:** జహీరాబాద్ ప్రాంతంలో కలకలం రేపిన దొంగతనాల కేసును ఛేదించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కర్ణాటక పోలీసులతో కలిసి దొంగలను పట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున జహీరాబాద్ పట్టణంలో ముగ్గురు సభ్యుల దొంగల ముఠా గంట వ్యవధిలోనే ఏకంగా 11 ప్రాంతాల్లో చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. రెండు మద్యం దుకాణాలు, రెండు కిరాణ షాపులు, మూడు బట్టల దుకాణాలు, ఒక బ్యాంగిల్ స్టోర్, మూడు ఇళ్లలో ఈ ముఠా దొంగతనాలకు పాల్పడింది. మోటారు సైకిల్‌పై వచ్చి దొంగతనాలు పాల్పడి పరారైంది. వీరిని కర్ణాటక ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దొంగలను పట్టుకునేందుకు కర్ణాటక పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. ఇప్పటికే వారిని ఆశ్రయించి సమాచారం సేకరించారు. దొంగతనాలకు పాల్పడిన ముఠా కర్ణాటకలోని చించోళి, బీదర్, గుల్‌బర్గా, బస్వకళ్యాణ్ ప్రాంతాల్లో 9 దొంగతనాలకు పాల్పడినట్లు, జహీరాబాద్‌లో పాల్పడిన దొంగతనం పదోకేసుగా పోలీసులు పేర్కొంటున్నారు. వీరు చేసిన దొంగతనాలు ఒకే తరహాలో ఉన్నట్లు గుర్తించారు. కర్ణాటకలో జరిగిన దొంగతనం తీరులోనే జహీరాబాద్‌లో జరిగిన దొంగతనాల తీరు ఉందని వారంటున్నారు. కేవలం క్యాష్ కౌంటర్‌లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. జహీరాబాద్‌లో రెండు మద్యం దుకాణాల్లో జరిగిన దొంగతనాల్లో వారు ఒక్క మద్యం బాటిల్ కూడా ముట్టుకోకుండా క్యాష్ కౌంటర్ వద్దకే వెళ్లి డబ్బు తీసుకొని ఉడాయించిన తీరు సీసీ ఫుటేజీలను బట్టి తెలుస్తోంది. లక్షలాది రూపాయల విలువ గల మద్యంతో పాటు ఆయా దుకాణాల్లో ఖరీదైన బట్టలు, కిరాణా సామగ్రి ఉన్నా వాటిని ముట్టుకోలేదు. సుదీర్ఘ కాలం తర్వాత జహీరాబాద్ ప్రాంతంలో దొంగతనాలు జరగడం కలకలం రేపింది. జర్నలిస్టు కాలనీలో మూడు తాళం వేసిన వాటిని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. చోరీకి గురైన వ్యాపార సంస్థలో వ్యాపారులు నగదును ఉంచకపోవడంతో పెద్దగా డబ్బు దొంగతనం జరగలేదు.

**ప్రాంతాలను మార్చుతూ..**

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ప్రాంతాలను మార్చుతూ దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎలాంటి రెక్కీ నిర్వహించకుండానే దొంగతనాలు చేస్తున్నట్లు ఆయా ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల తీరును బట్టి తెలుస్తోంది. ముఠా సభ్యులు దొంగతనాలు చేయడంలో ప్రావిణ్యులుగా ఆరితేరినట్లు భావిస్తున్నారు.


సీసీ ఫుటేజీలో నమోదైన దొంగలు

**త్వరలో పట్టుకుంటాం**

జహీరాబాద్‌లో దొంగతనాలకు పాల్పడిన ముఠాను త్వరలోనే పట్టుకుంటాం. ముఠా సభ్యులు కర్ణాటక ప్రాంత వాసులుగా నిర్ధారణకు వచ్చాం. అక్కడ ఇప్పటి వరకు తొమ్మిది చోట్ల ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారు. అక్కడి పోలీసుల సహకారంతో కేసును ఛేదిస్తాం. ఇప్పటికే వారి సహకారంతో దొంగతనాల తీరును గుర్తించాం. ముగ్గురు సభ్యుల ముఠానే దొంగతనాలకు పాల్పడింది.

–రవి, సీఐ-జహీరాబాద్

# స్కూటీని ఆపి.. ఉంగరాలు చోరీ

**చేగుంట(తూప్రాన్):** స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు ఆపి ఉంగరాలు దొంగిలించిన సంఘటన చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ బ్రిడ్జి వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రం స్కూటీపై చేగుంటకు వస్తున్నాడు. ఈ క్రమంలో రెడ్డిపల్లి బ్రిడ్జివద్ద రెండు బైకులపై వచ్చిన వ్యక్తులు పోలీసుల పేరుతో అతన్ని ఆపి, మాటల్లో దింపి చేతి వేళ్లకు ఉన్న రెండు బంగారు ఉంగరాలు బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చేగుంట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేశ్, చేగుంట ఎస్ఐ బాలరాజు సంఘటన స్థలాన్ని చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.


విచారణ చేస్తున్న పోలీసులు